దొరకలేదు. అతన్ని మనసులో అభినందించ కుండా ఉండలేకపోయాను.

“సార్! ఇలాచూడండి!” అన్నాడతను. అతని చేతిలో – నా సీటులోంచి తీసిన ఒక ఫైలుంది. ఏమిటన్నట్టు ప్రశ్నార్థకంగా చూశానతనివైపు.

“దీనిలో ఒక తప్పుంది సార్! పట్టు కోండి!” అన్నాడు–ఫైలు నాచేతికిస్తూ.

అదినా “ప్రెడిసెసర్” “డిస్పోజ్” చేసిన ఫైలులోని “రిపోర్టు” ఆ పేజీ మొత్తం చదివాను. మామూలుగా చదివానేమో నాకేమీ తప్పు కనిపించలేదు.

“ఏమీ తప్పున్నట్టు లేదే!” అన్నాను – అతనివైపు చూస్తూ.”

“అలా అంటే ఎలాసార్! తమరు పరీక్షగా చూసినట్టులేదు.” అతను చాలా వినయంగా అన్నాడు.

అతని ముందు ఓడిపోవటం ఇష్టంలేక, మరొక్కసారి, ఆ డిస్పోజలును పరీక్షగా చదివాను. ఈసారి తప్పు దొరికింది గూడాను, ఇంతకు ముందు పరీక్షగా ఫైలు చూడనందుకు నొచ్చుకున్నాను. ఇంతకీ ఆ తప్పేమిటంటె చాలా నవ్వొచ్చే ఆంగ్ల పదం.




“నన్ ఆఫ్‌ది ఫీల్డు ఆఫీసర్స్ హాజ్ నాట్ సబ్‌మిటెడ్ హిజ్ రిపోర్ట్!” అని ఉంది ఒకచోట. ఏఫీల్డు ఆఫీసరూ–తన రిపోర్టు పంపి ఉండలేదు అని అర్థమివ్వటానికి బదులు – ఆ వాక్యం – దానికి వ్యతిరేకమైన అర్థమిస్తోంది–మధ్యలో “నాట్” అనే ఆంగ్ల పదం అనవసరంగా ఉపయోగించటంవల్ల.

ఆ డిస్పోజలును క్రింద నుంచి పైవరకూ –అందరూ తమ విలువైన సంతక రాజాలతో అలంకరించారు గనుక, అది అలాగే చేరవలసిన ఆఫీసులకు వెళ్లిపోయింది.

దాని సంగతలా ఉంచండి. అటెండరు అప్పలరాజు పట్టుకున్న తప్పు ఇదేనని నమ్మకమేమిటి? అందుకని అతనితో– “మిస్టర్! అప్పలరాజూ! ఆతప్పేదో నాకు తెలిసింది. నేను అటు తిరిగి ఒక కాగితంమీద రాస్తాను దాన్ని. నువ్వటు తిరిగి మరో కాగితంమీద రాయి.” అన్నాను. ఇద్దరం అలాగే చేశాము. అతని కాగితం తీసుకుని చూద్దానుగదా! అతను రాసినది ఆవిషయమే! అప్పలరాజు సునిశిత బుద్ధిని మెచ్చుకోకుండా ఉండలేకపోయాను. అతనంటే ఎందుకనో నాకు అభిమాన మేర్పడింది.

“మరి నిన్నందరూ అలా చెడుగా చెపుతుంటా రెందుకని? నువ్వు జీతమంతా తాగుడుకు తగలేసి – ఇంట్లో పెళ్లాం పిల్లలను పస్తులు పడుకో పెడతావటగా! రోజూ ఇతరుల్ని పీక్కుతింటావటగా!” ఆదరంగా ప్రశ్నించాను.

“సార్! నన్ను గురించి నేను చెప్పుకుంటే ఏం బాగుంటుంది చెప్పండి? ఎప్పుడో నాటికొకసారి తాగే నామీద ఈ ఆఫీసులో అంతులేని దుష్ప్రచారం! నిజాని కివ్వాళ ఇంటిలో తిండి గింజలు కూడా లేవు. రాత్రికి నేను నాభార్యా పిల్లలు పస్తే! అయినా ఇవాళ తమబోటి వాళ్ళ కెవరికీ శ్రమ ఇవ్వదలుచుకోలేదు. చస్తే చస్తారు! చావనీయండి! జనాభా అన్నా తగ్గుతుంది” అన్నాడు. అతను రోషంగా – అసహాయంగా అన్నా అతని కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరగటం నేను గమనించక పోలేదు. అతని తీరు చూస్తే అతని మీద, అతని ఆర్థిక దైన్యస్థితిమీద, నా కంతులేని సానుభూతి కలిగింది.

వెంటనే జేబులో నుంచి ఓ అయిదు రూపాయలు తీసి, అతని కివ్వబోతూ – “దీనితో బియ్యం కొనుక్కుని మీ యింటికి తీసుకెళ్ళు.” అన్నాను.

అంతలో ఒక “కొలీగ్” కల్పించుకొని “ఏమోయ్! అప్పలరాజూ! ఏమిటివ్వాళ సెక్షన్ హెడ్‌గారినే పట్టావ్! బలేవాన్ను కొట్టావులే! త్వరగా వెళ్లుమరి! రత్తమ్మ సారాకొట్టు ఎదురు చూస్తుంటుంది!” అన్నాడు వెటకారంగా.

అప్పలరాజు ఏదో చెప్పబోయేటంతలో – ఆ కొలీగ్ తనే మళ్ళీ కల్పించుకుని– ‘సార్! అదంతా నాటకం! మీరిచ్చే అయిదురూపాయలు వాడింటికి వెళ్లవు. రత్తమ్మ సారా కొట్టుకి వెడతయి. పైగ అంతసబ్బ ఇవాళ

మీరిచ్చి, వాడిని మరో రెండు గ్లాసులు ఎక్కువ త్రాగమని పురికొల్పిన వారవుతారు. గుర్తుంచుకోండి!" అన్నాడు పెదవి విరుస్తూ.

నేనొక్క నిముషం ఆలోచించాను. డబ్బిస్తే నిజంగా అతనన్నట్టు అప్పల్రాజు తాగి తగలెయ్యొచ్చు. అలా చేస్తేనో......? అనుకున్నాను. వాస్తవానికి నేను ఆలోచించిన పనికి ఏ ప్యూనునో పంపవచ్చు. కానీ, అలా చేస్తే నాకు మనశ్శాంతేం ఉంటుంది? అందుకని నేను రిక్షాలో ఎక్కికూర్చుని "రా! అప్పల్రాజూ! రిక్షాఎక్కు!" అన్నాను.

"ఎక్కడికిసార్!" అన్నాడు అప్పల్రాజు ఆవలించేసి.

"రత్తమ్మఇంటికి కాదులేవోయ్! రా!" అన్నాను నవ్వుతూ.

అతను రిక్షాఎక్కి నా ప్రక్కన బిడియ పడుతూ కూర్చోగానే కొంతమంది నావైపు ఆశ్చర్యంగా — కొంతమంది జుగుప్సగా చూశారు—ఇతనికేమన్నా మతి పోయిందా ఏమిటి అన్నట్టుగా. కాని నేను చిత్తశుద్ధిగా చేయదలచుకున్న పనిని అంతమాత్రం చేత వాయిదా వేసుకునే మనస్తత్వం కాదునాది.

రిక్షాని బజార్లోఆపి ఓ బియ్యపుకొట్లో అయిదు రూపాయల బియ్యం రెండు పొట్లాలుగా కట్టించాను. మా యిద్దరి చేతుల్లో సంచిఏదీ లేకపోవటంవల్ల, "రిక్షా వాడికి మీ యింటిజాడను చెప్పు అప్పల్రాజూ!" అన్నాను అతన్నుద్దేశించి. అతను అలాగేచేసి రెండు చేతులు జోడించి నాకు కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరిస్తూ "మీరెంత మంచి వారు సార్! నాకు మా పిల్లలకు రెండు రోజులు అన్నం పెడుతున్నారు" అన్నాడు.

"ఊర్కో! అలా పొగడకు! అలా చేస్తే నేను చేసినదానికి ఫలిత ముండదు" అన్నాను. అప్పల్రాజు పేదకుటుంబాన్ని నాశాయశక్తులా ఆదుకుంటున్నానన్న భావం నా కెంతో సంతృప్తిని కలుగ జేసింది.

ఇంతలో అప్పల్రాజు ఇల్లు వచ్చేసింది. అతను బియ్యపు పొట్లాలని ఇంట్లో పడేసి రాగానే తిరిగి ఇద్దరం రిక్షాలో ఎక్కి ఆఫీసుకు వచ్చేశాం.

నేను చేసిన మేలును గురించి నన్నో-ఆపద్బాంధవుడిలా-అనుకున్న దేవుడిలా చిత్రీకరించి ఆఫీసులో అందరికీ చెప్పి తెగ పొగిడే వాడు అప్పల్రాజు. ఎందువల్లనోగాని ఆఫీసులో

## ఇదీ సారా (రో) కథే

వారెవరూ నామీద ఎలాంటి వ్యాఖ్యా చేయలేదు.

"శలవు సార్! నమస్కారం. కాస్త ఈ పేదవాళ్లని అప్పుడప్పుడూ ఇలా కనికరిస్తూ ఉండండి! మీ పేరు చెప్పుకుంటూ ఉంటాము మా యింటిల్లపాదీను— నా చేత మీకు కావలసిన ఆఫీసుపని—సొంతపని చేయించుకోండి—నేను మీకు నమ్మినబంటును" అంటూ వెళ్లిపోయాడు అప్పల్రాజు.

"ఇతనిని త్వరలోనే త్రాగుడుకు పూర్తిగా దూరం చేయగలను నేను" అనుకుంటూ తృప్తిగా నిట్టూర్చాను.

ఆఫీసులో నా పని ముగిసే సరికి రాత్రి ఏడుగంటలయింది. అప్పటికి మిగతావాళ్లంతా వెళ్లిపోయి చాలా సేపయింది. హోటలుకెళ్లి భోజనంచేసి కొత్తపేటలోని నా రూముకు


త్వరలో
'కాన్ఫరెన్సుల
తిరునాళ్లు'
కడుపుబ్బ నవ్వించే
వ్యంగ్య రచన


తిరుగుముఖం పట్టాను. రిక్షాలోవెళ్లే కన్నా, నడక వంటికి మంచిదని మెల్లిగా అడుగు లేస్తున్నాను" రత్తమ్మ సారా దుకాణం, అన్న బోర్డు ఒకచోట కనుపించగానే కాళ్లకు బ్రేక్ వేసినట్టుగా ఆగిపోయాను. అంతేకాదు షాక్ తిన్నట్టు ఫీలయ్యాను ఆ దృశ్యంచూసి.

అక్కడ అప్పల్రాజు — అటెండరు అప్పల్రాజు — ఆఫీసువాళ్ల నోళ్లల్లో నానే అప్పల్రాజు — అకస్మాత్తుగా నా అభిమానం సంపాదించుకున్న అప్పల్రాజు — ఓ బల్లకు జేరబడి నిషాలో మునిగితేలుతూ—"పొయ్యోవె! ఏందనుకున్నావో...గుద్దుకు చంపేస్తాను... నాయాల్ది..." అంటూ ఇంకా ఏమేమో పేలుతున్నాడు. బాగా పట్టించినట్లుగా ఉంది వాలకం.

నాకు అప్పల్రాజుమీద బలేకోపం మొచ్చింది. దాన్ని ఆశ్చర్యం జయించింది. నా అంతరంగాన్ని మధిస్తే — వేధించి సాధించే ప్రశ్నల్లా ఒక్కటే! అప్పల్రాజుకు త్రాగటానికి డబ్బెక్కడిదీ రోజు? గబగబా నడచి వచ్చి సారా దుకాణంలోకి అడుగు పెట్టిన నన్ను చూసి అక్కడ తెలివిలో వున్న కొంతమంది ఆశ్చర్య పోయారు. నిషాలో ఉన్నవారు నా ఉనికిని పట్టించుకోవలసిన స్థితిలో లేరు.

పిప్పళ్లబస్తాలా ఉన్న రత్తమ్మ నన్ను వింతగా చూసి "ఏంబాబూ! మీరూ ఈ సరుకు తాగుతారా? వింతగా ఉందే!" అంది —కళ్లు పెద్దవిగా భయంకరంగా చేసి.

"అదిసరేగాని రత్తమ్మా! ముందీ సంగతి చెప్పు, ఈ అప్పల్రాజు నీ కెంతిచ్చితాగాడు?" అన్నాను ఆతృతగా.

"రోజూ రూపాయో-అర్థో కన్నా ఎక్కువ తేలేని ఈ సన్యాసి ఇయ్యాల అయిదు రూపాయల సరుకు పొయ్యమని పూటుగా తాగాడు బాబుగారూ! అయితే డబ్బిచ్చి మాత్రం కాదండోయ్..." అని ఆగింది రత్తమ్మ.

"అంటే!" అన్నాను కంగారుగా— —ఉత్కంఠ ఉరకలేస్తోంది నాలో.

"ఎవరో ఓ మారాజు తిండిగింజలు కొనిచ్చాట్ట కాసిన్ని. అవి తీసుకొచ్చి సరుకు పొయ్యమన్నాడు.ఏదైతే నాకేటిబాబూ! అందులో బంగారం లాటి బియ్యం గూడాను. ఇదిగో చూడండి!" అంటూ గజగమనంతో లోనికెళ్లి పట్టుకొచ్చింది రత్తమ్మ.

అవి అక్షరాలా నేను కొనిచ్చిన బియ్యపు పొట్లాలు! హతాశుణ్ణై వెనక్కు తిరిగాను. అడుగులు భారంగా పడుతున్నాయి. అంతకన్నా భారంగా ఉంది మనసు. మా కొలీగ్ అన్న మాటలు చెవుల్లో గింగురు మన్నాయి.

"మీరివ్వాళ వాణ్ణి మరో రెండుగ్లాసులు ఎక్కువ త్రాగమని పురికొల్పిన వారవుతున్నారు"

"తాగి తగలేస్తావని డబ్బును బియ్యంగా మార్చి యిచ్చాను నేను — నువ్వు బియ్యాన్ని మీ కుటుంబం కన్నీళ్లని— ఆకలి కడుపుల్ని—గ్లాసులోని సారాగా మార్చావు— ఆఫ్టరాల్—నీముందు నేనెంతోయ్ మిస్టర్! అప్పల్రాజూ! యూ ఆర్ రియల్లీ గ్రేట్!— ది గ్రేట్—నిజంగా నీముందు నేనోడిపోయాను— నిన్ను త్రాగుడు నుంచి భగవంతుడు గూడా మాన్పించలేడు."

ఎవరో వికటాట్టహాసం చేసినట్టయింది. కాదు. వెక్కిరిస్తున్నట్టుంది. ఇంతకూ అదెవరు? — నా సానుభూతి!— ఫలించని సానుభూతి!!